క్లుప్తంగా

నేడు ఉపాధి బహిరంగ సభ

నింద్ర: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. మండలంలో గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీలో చేపట్టిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించిందని పేర్కొన్నారు. తనిఖీ వివరాలను సభలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

తూనికలు, కొలతలపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఏసీ స్వామి

పిచ్చాటూరు: తూనికలు, కొలతలపై 6 మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు తూనికలు, కొలతలు శాఖ డిప్యూటీ కమిషనర్ జీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి తూనికలు, వేయింగ్ మిషన్, లీటర్ వంటి పరికరాలతో శిక్షణ ఇచ్చారు.

వేగవంతంగా పింఛన్ల పంపిణీ

వరదయ్యపాళెం: మండలంలో ఒకటో తేదీ శుక్రవారమే వలంటీర్లు వేగవంతంగా పింఛన్లను పంపిణీ చేశారు. మొత్తం 6,501 పింఛన్లకు సంబంధించి 4256 మందికి మొదటి రోజే పంపిణీ చేసి 66శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.1,17,31,250 లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. మిగిలిన వారికి శనివారం పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



వెంగారెడ్డికండ్రిగలో పింఛన్ పంపిణీ

ఘనంగా గురు పూజోత్సవం



గురుపూజోత్సవంలో పాల్గొన్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని శాంతి ఆశ్రమంలో గురుపూజోత్సవం, వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీవీరభద్రస్వామి ఆలయం నుంచి శ్రీరుద్రమూర్తిస్వామి గురు పాదుకలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా శాంతి ఆశ్రమం వరకు తీసుకువచ్చారు. రుద్రమూర్తి స్వామి విగ్రహాన్ని సుందరంగా అలంకరించి యాగ పూజా కార్యక్రమాలు నిర్వహించారు గజేంద్ర స్వామి, నీలకంఠ స్వామి, గురునాథం, వీరభద్రయ్య, తిరుపతి రమణ, శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య శిబిరం



రక్త నమూనాల సేకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పరిసర నాలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూప్, ఆర్‌హెచ్ కారకం నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ మాట్లాడుతూ రక్త గ్రూప్‌లు, రక్తసేకరణ కేంద్రాలు, రక్త నిధులు ప్రాముఖ్యతను వివరించారు. తిరుపతికి చెందిన మహేయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. తొండమనాడు, ఎగువవీధి, పానగల్, ఊరందూరు ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 256మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, రమణ, కోమలాదేవి, రాజకుమారి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీడీ చెన్నయ్య

సత్యవేడు: మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సచివాలయ సిబ్బంది, హౌసింగ్ ఏఈలు పూర్తి చేయాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి యు.చెన్నయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న 419 ఇళ్లు జనవరి 30 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కులాల సర్వే త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రా విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రవికి సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జరీనా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్, ఏఎస్‌డబ్ల్యూఓ ఎస్. కృష్ణ, ఏఈఓ సుబ్రమణ్యం, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి





సత్యవేడు: పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఇలాంటి పాలన కోసం మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీఎస్‌పురం సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని తెలిపారు. సర్పంచ్ సిద్దమ్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, ఉగ్గుమూడిగురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సత్యవేడు సచివాలయంలో..

సత్యవేడు: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి అన్నారు. సత్యవేడు సచివాలయం–2లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం సర్పంచ్ మంజుల అధ్యక్షతన జరిగింది. సచివాలయంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలే నిరుపేదలకు శ్రీరామ రక్ష అని అన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, నాయకులు బెల్లు రమేష్, సచివాలయ కన్వీనర్లు ఎంపీ రవి, పునిద కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ మహిళా సభ్యులు మస్తాని, ఈఓపీఆర్డీ మునిరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





బీఎన్‌కండ్రిగ : పథకాల బోర్డు ఆవిష్కరణ, ఏర్పేడు: మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి

అర్హులందరికీ పథకాల లబ్ధి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రజలందరికీ పథకాలు అందుతున్నాయని, ఇలాంటి పాలన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా ప్రజలకు పలు పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చెర్లోపల్లె సచివాలయ కన్వీనర్ మావిళ్లపల్లి వెంకటేష్, సర్పంచ్ రజని, నాయకులు శివ, శంకరయ్య, డీపీ రమణ, సుబ్రమణ్యం, గిరి, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి కోసం..

ఏర్పేడు: పేదల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ముసలిపేడులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ముందు జెండా ఆవిష్కరణ చేసి, వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. రాత్రి పల్లె నిద్ర చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, మునిశేఖర్‌రెడ్డి, రాంబత్తెయ్య, మాధవరెడ్డి, మునిరాజా, దామోదరంరెడ్డి, రాజారెడ్డి, విశ్వనాధరెడ్డి పాల్గొన్నారు.

వేకువజాము నుంచి పింఛన్ల అందజేత





బీఎన్‌కండ్రిగ: పింఛన్ అందజేస్తున్న వలంటీర్, శ్రీకాళహస్తి: ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం వలంటీర్లు తెల్లవారుజాము 5 గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆలత్తూరు. కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, పల్లమాల, జీఎన్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం లోపు 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వడంపై పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆరో వార్డు పరిధి సాలెపేటకు చెందిన లబ్ధిదారు భాస్కర్‌కు వలంటీర్ అజారుద్దీన్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఒకటో తేదీనే భాస్కర్ ఇంటికి పింఛన్ అందించేందుకు వలంటీర్ వెళ్లగా, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతున్నట్లు తెలిసింది. వెంటనే ఆస్పత్రికి వెళ్లి ఆయనకు పింఛన్ అందజేశారు. వలంటీర్ సేవలను లబ్ధిదారులు కుటుంబసభ్యులు, మున్సిపల్ అధికారులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌పై వంట పాత్రల చోరీ కేసు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలోని మల్లవారిపాళెం ఈస్ట్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మునికృష్ణయ్యపై వంట పాత్రల చోరీ కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. రూ.1.5 లక్షల విలువ చేసే వంట పాత్రలను అపహరించుకుపోయినట్లు బాధితుడు సాయిసత్య చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు మేరకు.. చెంగంబాకం గ్రామంలో మునికృష్ణయ్యకు చెందిన కృష్ణ లావేంజ్ హోటల్‌ను 2019 నుంచి సాయిసత్య చరణ్ లీజుకు తీసుకున్నాడు. అయితే హోటల్ గదిలో ఉంచిన వంట పాత్రలు 10 రోజుల క్రితం నుంచి కనిపించడం లేదు. హోటల్ వద్ద సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ ఇచ్చిన సమాచారం మేరకు యాజమాని మునికృష్ణయ్య అపహరించుకు వెళ్లినట్లు లీజుకు తీసుకున్న సాయి సత్య చరణ్‌కు తెలిపాడు. దీంతో ఆయన ఫిర్యాదు చేయడంతో సెక్షన్ 379 ఐపీసీ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చరిత్ర, సంస్కృతిపై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర అధ్యాపకులు, అర్కియాలజిస్టు సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారతదేశ చరిత్ర, సంస్కృతి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ మురళి, అధ్యాపకులు దీనదయాల్, రాజేంద్రుడు, పరంధామ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవలో అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం అమ్మవారి ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగింపు అనంతరం అమ్మవారిని ఊంజల్ మండపంలో ఉయలలో కొలువుదీర్చారు. తదుపరి వేదోక్తంగా జరిగిన ఊంజల్‌సేవను తిలకించి భక్తులు తరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కరిపేటి కాలువకు గండి

- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- నీట మునిగిన వరిపంట



బత్తలవల్లం వద్ద నీట మునిగిన వరి పంట

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం వద్ద ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి వరి పంట నీట మునిగింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు బత్తలవల్లం సమీపంలోని కరిపేటు కాలువకు గండి పడింది. అప్పట్లో పెద్దఎత్తున వరదనీటి ఉధృతకు పంట పొలాలపై ఇసుక మేట్లు ఏర్పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు గండిని పరిశీలించి పూడ్చేందుకు అంచనాలు సిద్ధం చేశారు. ఏడాది కావస్తున్నా గండి మాత్రం పూడ్చలేదు. దీనిపై పలుమార్లు రైతులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. తాజాగా వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పెద్దఎత్తున కరిపేటు కాలువకు వరదనీరు ఉధృతి పెరిగింది. దీంతో మళ్లీ గత ఏడాది గండి పడిన చోటే పంట పొలాలపైకి వరదనీరు వెల్లువలా ప్రవహించింది. మరోమారు కొంత దూరం పొలాలపై ఇసుక మేట్లు ఏర్పడగా, మరో 50 ఎకరాలు వరి పంట నీట మునిగింది. గండి పడిన ప్రాంతంలో ఓ రైతు రెండేళ్లుగా ఐదెకరాల భూమి పంట సాగు చేయకుండా బీడుగానే వదిలేశాడు. దీనంతటికీ ఇరిగేషన్ శాఖ అధికారులే కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా అక్టోబర్, నవంబర్ మాసాల్లో కురిసే భారీ వర్షాలకు పెద్దఎత్తున కరిపేటు కాలువకు వరదనీరు చేరుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కాలువపై ఆ శాఖ నిర్లక్ష్యం చూపడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే కాలువకు పడిన గండిని పూడ్చాలని కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు





సీతారాంపేట చెరువుకు చేరుతున్న నీరు, అంజిమేడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బండమానివాగు

ఏర్పేడు: మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు అటవీప్రాంతాల నుంచి నీరు వాగులు, వరవకాల్వల ద్వారా ఉధృతంగా చెరువులకు చేరుతోంది. మండలంలో 86 ఇరిగేషన్, 54 ఊటగుంటలు ఉన్నాయి. ఇప్పటికే అటవీ ప్రాంతాలకు సమీపంలోని చింతలపాలెం, అంజిమేడు, పంగూరు, రాజులపాలెం, జంగాలపల్లి, ఇసుకతాగేలి, కోబాక, ఆమందూరు తదితర చెరువులకు సగానికి పైగా నీరు చేరింది. మరో రెండు రోజుల పాటు ఇలాగే నీరు చేరితే పలు చెరువులు నిండే అవకాశాలు ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇసుకతాగేలి చెరువుకు చేరిన నీరు

పాహిమాం.. శ్రీకాళహస్తీశ్వరా..!



ఆకాశ దీప పూజలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, భక్తులు

శ్రీకాళహస్తి: పాహిమాం.. శ్రీకాళహస్తీశ్వరస్వామి అంటూ భక్తులు ఒక్కసారిగా నామస్మరణ చేయడంతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. శుక్రవారం ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి తొలుత అర్చకులు పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఈసందర్భంగా భక్తుల ఓం నమః శ్శివాయ నామస్మరణలు మిన్నంటాయి. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



సత్యవేడు: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఎస్పీని ఆశీర్వదిస్తున్న అర్చకులు, చిత్రంలో ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సత్యవేడు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల పురోగతిని పరిశీలించారు. రానున్న ఎన్నికలకు పోలీసులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. మండలాల పరిధిలో సంశయాత్మక గ్రామాలు, పోలింగ్‌బూత్ వివరాలపై డీఎస్పీ, సీఐలు సమగ్ర నివేదిక ఇవ్వాలని తెలిపారు. తమిళనాడు–ఆంధ్ర సరిహద్దులో సత్యవేడు ఉందని, తమిళనాడులో గ్రూపుల తగాదాలు, ఘర్షణల్లో హత్యలు జరుగుతున్నాయని, మృతదేహాలను ఆంధ్రా సరిహద్దులో పడేసి వెలుతున్న సంఘటనలు నాలుగైదు జరిగాయని పేర్కొన్నారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల్లో నిఘా పెంచుతామన్నారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సత్యవేడు సీఐ ఎన్.శివకుమార్ రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

సారాపై నిరంతరం ఆకస్మిక తనిఖీలు

నాగలాపురం: సారాపై ఉక్కుపాదం మోపేందుకు నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేయాలని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నాగలాపురం పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. జనరల్ డైరీని పరిశీలించారు. కేసుల పురోగతిపై ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ, సారా తయారీ గ్రామాల్లో నిరంతర తనిఖీ, కార్డన్ అండ్ సెర్చ్, నాకా బందీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాత నేరస్తులు, అనుమానితులు ఉన్న గ్రామాలకు వెళ్లి తరచూ కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. మహిళా సమస్యపై తక్షణం స్పందించి న్యాయం చేయాలని తెలిపారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు, సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, డీసీఆర్‌బీ చంద్రశేఖర్ పిళ్లై, ఎస్‌ఐ ఓబయ్య , సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన

అనంతరం ఎస్పీ స్థానిక టీటీడీ అనుబంధ శ్రీవేదవల్లీ సమేత వేదనారాయణస్వామి ఆలయం, సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఎస్పీకి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆలయ చైర్మన్ స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి ఆలయ మర్యాదలతో ఎస్పీని సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అపరంజిరాజు, చిన్నదొరై, మహేష్, పాలక మండలి సభ్యులు జి.మునివేలు ,ఎస్ఎం సురేష్, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

నేడు ఓటరు నమోదుపై ప్రత్యేక డ్రైవ్

శ్రీకాళహస్తి: రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశం మేరకు శనివారం, ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎల్‌ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండి ఎన్నికల క్లెయిమ్‌లు, ఫారం 6, 7, 8 తీసుకుని యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ శని,ఆదివారాల్లో నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

సత్యవేడు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షేక్ జరీనా తెలిపారు. రెండు రోజుల పాటు ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలగింపులు, చేర్పులు, బదిలీలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

వరదయ్యపాళెం: ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి 5 గంటల వరకు శని, ఆదివారాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం-6, తొలగింపునకు ఫారం-7, పేరులో మార్పులు, చేర్పులు కోసం ఫారం-8ని అందజేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో 46 మంది బీఎల్‌ఓలు పాల్గొంటారని తహసీల్దార్ తెలిపారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



తొట్టంబేడు : ర్యాలీలో పీహెచ్‌సీ సిబ్బంది



పిచ్చాటూరులో వైద్య సిబ్బంది ర్యాలీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించగలమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రత్నాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అపోహలు తొలగించుకుని తగిన అవగాహన పెంచుకోవాలన్నారు. అప్రమత్తంగా వ్యవహరించగలిగితే సమాజం నుంచి పారదోలగలమని చెప్పారు. ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిపూజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: సమష్టి కృషితో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడతామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హమీద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైద్య సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, ముందు జాగ్రత్తలే శరణ్యమన్నారు. రెండవ వైద్యాధికారి మునిచరిత్ర, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఎయిడ్స్ ఉంటే పుట్టే పిల్లలకు సోకకుండా ఉండేందుకు మందులున్నాయని తెలిపారు. రక్తం మార్పిడి, విచ్చలవిడి లైంగిక చర్యలతో ఎయిడ్స్ సోకుతుందన్నారు. సీహెచ్‌ఓ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహనే నివారణకు మందు

రేణిగుంట: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చని ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు అన్నారు. మండలంలోని గుత్తివారిపల్లె ఎస్సీ కాలనీలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, అరక్షిత లైంగిక చర్యలు, రక్త మార్పిడి వల్ల వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రపంచ వైద్యరంగానికి సవాలుగా ఉన్న ఎయిడ్స్ వ్యాధికి ఇప్పటి వరకు మందు కనిపెట్టలేదన్నారు. హెచ్ఐవీ సోకిన వారి పట్ల వివక్ష చూపకూడదని, స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. సంస్థ ఈసీ మెంబర్ కోదండరామిరెడ్డి, మస్తాన్, పార్థసారథి పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: హెచ్ఐవీ వైరస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి ఆ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వరదయ్యపాళెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, ఆశావర్కర్లతో కలసి ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుసూదన్, పీహెచ్‌ఎన్ తులసమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగలో ర్యాలీ



రేణిగుంట : అవగాహన ర్యాలీ



వరదయ్యపాళెం: వైద్య సిబ్బంది ర్యాలీ